# కథ

# చిరుతపులి కళ్లు

## మొదటి భాగం

లాటిన్ అమెరికన్ మూలం:
లూసావాలెంజ్వేలా
ఆంగ్లానువాదం: జెరిమీ ముండే

తెలుగుసేత: ఎలనాగ

వాళ్లిద్దరు చీకటి నిండిన కారిడార్‌లో నడుస్తున్నారు. ఉన్నట్టుండి ఆమె అకస్మాత్తుగా వెనుదిరగటంతో అతడు కెవ్వుమని అరిచాడు.

"ఏమైంది" అడిగిందామె.

"నీ కళ్లు... నీ కళ్లు అడవి జంతువుల కళ్లలాగ మెరుస్తున్నై" అన్నాడతడు.

"అలా ఏం మెరవవు, సరిగ్గా చూడు" అన్నదామె.

స్తబ్ధత నిండిన సంపూర్ణ అంధకారంలో అతనికెదురుగా ఆమె తప్ప మరేమీ లేదక్కడ. చీకట్లో చేయిని చాచి స్విచ్ నొక్కి లైటును వెలిగించాడు. ఆమె కళ్లు మూసుకుని వుంది. వెల్తురు పడీ పడగానే కళ్లు మూసుకుని వుంటుంది అనుకున్నాడు. అయినా అతని మనసు కుదుటపడలేదు.

వాళ్లిద్దరి మధ్య సంభాషణ మెరిసే ఆమె కళ్ల విషయం నుండి ఇతర విషయాల మీదికి మళ్లింది. ఆ స్వయం ప్రకాశితాలైన ఆకుపచ్చని కళ్లు ఐడెంటిటీ కార్డుల మీద వుండే మట్టి రంగుకు మారినై. అంటే సాధారణంగా ఆఫీసులో పని చేసేటప్పుడు కళ్లకు వుండే మట్టిరంగు అన్నమాట. ఆమెకు ఉద్యోగం ఇస్తానన్నాడతడు (మామూలు పరిస్థితుల్లో ఉద్యోగమన్నది గగన కుసుమమే). వాళ్లిద్దరి మధ్య ఆకుపచ్చని కాంతి పరచుకుంది. కట్టడాలు వున్న బయటి ప్రపంచానికి భిన్నంగా ఆఫీసులో మాత్రం అరణ్య శబ్దాలతో మెరిసే ఆ రెండు కళ్లు... సరే సరే, ఈ విధంగా చెప్తూ పోతుంటే మన కథ తాలూకు సంఘటనల పరంపర ఎటు పయనిస్తుందో చెప్పలేం కనుక సరిగ్గా చెబుతాను. కిటికీ తెరిచి వుంది. తెరిచి వున్న కిటికీ అడవిలోని శబ్దాలకు కారణాన్ని వివరిస్తుందనేది నిజమే కావచ్చు. చప్పుళ్లను అర్థమయ్యేలా వివరించగలమేమో కాని కారిడార్లో కనిపించిన ఆ కళ్లలోని మెరుపును సహేతుకంగా వివరించలేం. ఎందుకంటే తెరిచిన కిటికీకి చీకటికి మధ్య ఓ మూసిన ద్వారం ఉంటుంది మరి.

అతణ్ని ఎదుర్కునే ఉద్దేశ్యంతోనే ఆమె కారిడార్లో వెనుతిరిగిందనటంలో సందేహం లేదు. అయితే అతణ్ని ఆ విధంగా వీక్షించిన ఆ మెరుపుకళ్ల లక్ష్యం ఏమై వుంటుంది. ఆ కళ్లు అతణ్నుంచి ఏమాశించాయి? ఏం డిమాండ్ చేశాయి? చీకట్లో కారిడార్‌లో వున్నప్పుడు అరిచాను కాని పద్నాలుగో అంతస్థులోని ఆఫీసులో వున్నప్పుడు నేను అరవలేదెందుకు? అని తనను తాను ప్రశ్నించుకున్నాడతడు. ఆ రెండు కళ్లతో మాట్లాడుతుంటే అప్పుడు తానేం మాట్లాడుతున్నాడో, ఏం మాట్లాడాల్సి వుందో, తాను మెల్లగా తప్పించుకున్న ఆ ఉచ్చు ఎక్కడ వున్నదో, ఎక్కడ వుండిందో అతనికి తెలియదు. తన వెనుక కిటికీ తెరిచి వుండగా ఆమెతో మాట్లాడుతున్నప్పుడు ఆమెవి అడవి జంతువు కళ్లు అనుకున్నాడు. ఆ భయం నిండిన కేకను అణచుకోవాల్సింది లేక దాని గురించి లోతుగా ఆలోచించాల్సింది అనుకున్నాడు.





# రెండవ భాగం

రాత్రి మూడు గంటలప్పుడు ఒక అపరిచిత శబ్దం విని ఓ మహిళా నువ్వు మేల్కొంటావు. నీ పడక మీద నిశ్చలంగా వుండిపోతావు. నీ బెడ్‌రూంలో ఎవరో తచ్చాడుతున్న శబ్దం వచ్చి ఓ పురుషుడు కదులుతున్నట్టు నీకు తెలుస్తుంది. పురుషుడు అట్లా తలుపును అధిగమించి వచ్చాడంటే అతడు నీ మీద దాడి చేయదల్చుకున్నాడన్న మాట. కార్పెట్ మీద అతని మెత్తని అడుగుల శబ్దాన్ని వింటావు. గాలి చిన్నగా కదిలినట్టనిపిస్తుంది నీకు. ఆ పురుషుడు దగ్గరగా వస్తుంటే నువ్వు భయంతో కదలక మెదలక వుండిపోతావు. అకస్మాత్తుగా నీ లోపలి ఏదో ఒక శక్తి భయంకన్న ఎక్కువగా బలపడిపోతుంది (లేక బలపడేది ఆ భయమేనా?) అప్పుడు నువ్వు చీకట్లో గిరుక్కున ఆ మనిషికి ఎదురుగా తిరుగుతావు. బహుశా నీ కళ్ల లోని మెరుపును గమనించి ఆ మనిషి కెవ్వున కేక వేసి ఉక్కపోత కారణంగా బార్లా తెరిచి వుంచిన కిటికీలోంచి బయటికి దూకి పారిపోతాడు.

ఇక్కడ తలెత్తే ఎన్నో ప్రశ్నల్లో ఈ కింది రెండు సందర్భానికి సరిగ్గా సరిపోయినట్టుంటై.

1. మొదటి భాగంలోని స్త్రీ, ఈ రెండో కథలోని నువ్వూ ఇద్దరూ ఒకటేనా?

2. ఈ సంఘటన గురించి విచారణ జరిగినప్పుడు నీ గదిలో ఒక పరాయి పురుషుడు ఎందుకు వున్నాడని పోలీసులు ప్రశ్నిస్తే దానికి నువ్వేం సమాధానమిస్తావు?

**తన వృత్తి పట్ల గాఢమైన శ్రద్ధాసక్తులు గల ఆ డాక్టరు బోలెడన్ని పరీక్షలు చేసి నీ కంటిలో ఏ సమస్యా లేదని తేల్చి పారేస్తాడు. "నా కంటి దృష్టి గురించి కాదు నా బాధ" అనేసి మరేం మాట్లాడకుండా ఉండిపోతావు నువ్వు. అప్పుడు ఆ కళ్ల డాక్టరు నీ కళ్లలోపలి పొరలను మరింత జాగ్రత్తగా పరిశీలించి లోపల ఒక నల్ల చిరుతపులి కనిపించిందని చెప్తాడు. దానికి కారణాన్ని అతడు నీకు వివరించలేదు.**


మొదటి ప్రశ్నకు సమాధానం: అవును, రెండు కథల్లో వున్నది నువ్వే. ఆ కారణంగానే కాక గత సంఘటనల దృష్ట్యా ఉదయం తొమ్మిది గంటలప్పుడు నువ్వు కళ్లడాక్టరు దగ్గరికి పరుగెత్తుతావు. తన వృత్తి పట్ల గాఢమైన శ్రద్ధాసక్తులు గల ఆ డాక్టరు బోలెడన్ని పరీక్షలు చేసి నీ కంటిలో ఏ సమస్యా లేదని తేల్చి పారేస్తాడు. "నా కంటి దృష్టి గురించి కాదు నా బాధ" అనేసి మరేం మాట్లాడకుండా ఉండిపోతావు నువ్వు. అప్పుడు ఆ కళ్ల డాక్టరు నీ కళ్లలోపలి పొరలను మరింత జాగ్రత్తగా పరిశీలించి లోపల ఒక నల్ల చిరుతపులి కనిపించిందని చెప్తాడు. దానికి కారణాన్ని అతడు నీకు వివరించలేదు. తాను గమనించిందాన్ని రాసుకుని విశ్లేషణను మాత్రం తనకన్న ఎక్కువ ఊహాశాలి, ఎక్కువ నిపుణుడైన తోటి డాక్టరుకు వదిలిపెడ్తాడు.

నిశ్శబ్దంగా ఇంటికి తిరిగివచ్చి నిన్ను నువ్వు కుదుటబరచుకోవడానికి ఒక చిమ్మటతో నీ ముఖం మీది వెంట్రుకల్ని పీకెయ్యడం ప్రారంభిస్తావు. నీ లోపల ఒక చిరుతపులి గర్జిస్తుంది కాని నీకది వినపడదు.

రెండో ప్రశ్నకు సమాధానం: తెలియదు.

ప్రారంభంలో(దీనికి ప్రారంభమనేది ఒకటి వుంటే) బహుశా నువ్వు ఊహించిన విధంగా చీకట్లో మెరిసే నల్ల చిరుతపులి తాలూకు పచ్చకళ్లు అద్దంలో కనబడవు. ఈ కథ మొదటి భాగంలోని పురుషుడు ఇప్పుడామెకు బాస్. అయితే ఇప్పుడాయన ఆమెకు ఆజ్ఞలివ్వగలిగేటంత సాహసం చేయలేడు. ఎందుకంటే ఆమె అకస్మాత్తుగా లైటును తీసేసి మళ్లీ ఆ కళ్లను తను ఎదుర్కొనేలా చేస్తుందని భయం. అదృష్ట వశాత్తు ఆమె లోపలి చిరుతపులి ఏ మార్గం ద్వారా బయటికి రాదు. భయమే అలవాటుగా మారి ఒక రకమైన ప్రశాంతతతో రోజులు గడిచిపోతుంటాయి. ప్రతి ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు కరెంటాఫీసువాళ్లు ఆ ప్రాంతంలో పవర్‌కట్ చెయ్యకుండా ఏర్పాట్లు చెయ్యడం, తన చేతికి అందేంత దూరంలో డ్రాయరు పై సొరుగులో ఒక మంచి టార్చిలైటును అందుబాటులో ఉంచుకోవడం, సాయం కాలపు ఆఖరి సూర్యకిరణం కూడా గది లోపలికి ప్రసరించి తన పర్సనల్ సెక్రెటరీ గురించిన ఏ దురూహ రాకుండా ఉండే విధంగా కిటికీని తెరిచి వుంచడం (ఇంతకు ముందు తన పర్సనల్ సెక్రెటరీ గురించి ఆ విధమైన దురూహా వచ్చేదతనికి)– ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటాడతడు. కాని ఒక రాత్రి ఆమెను బయటికి తీసుకువెళ్లాలని, క్లబ్ డ్యాన్సుకూ ఆ తర్వాత తన పడక మీదికీ తీసుకువెళ్లాలని అతని కోరిక. అయితే ఆ కళ్లను మరోసారి ఎదుర్కోవాలనే భయం అట్లాంటి ఆనందాన్ని పొందకుండా అతన్ని నివారిస్తుంది. అసలు మెరిసే ఆ కళ్లను తను నిజంగా చూశాడా లేక అవి కేవలం తను ఊహించుకుంటున్నవా? (దృష్టి భ్రమలాగ, లేక అట్లాంటిదే మరేదోలాగ) అని ఆలోచిస్తుంటాడతడు. తన ఊహాశక్తి అంత గొప్పదనే నమ్మకం లేకపోవడం వల్ల ఆ మెరిసే కళ్లను తాను చూసినట్టు నిర్ధారించుకుంటాడు. ఆమెను సంతుష్టిపరచడానికి అతడు సంగీతాన్ని ఉపయోగిస్తాడు. డిక్టేషన్ తీసుకుంటున్నప్పుడు ఆమె అతని మీదికి లంఘించడానికి సిద్ధంగా లేనట్టనిపిస్తుంది.

బ్యూనాస్ ఏరీస్ నగరం తనను తానూ, అతన్నీ జాగ్రత చిత్తభ్రమను పొందటానికి అనుమతించదు. మనం కొంతసేపు అతన్ని గమనిస్తే ఆ భయం భ్రమపూరితమైనది కాదని నిశ్చయంగా తెలిసిపోతుంది.




అతడు మనకు అంతగా నచ్చడు. కాని రాను రాను తనను తాను విముక్తుణ్ని చేసుకునే అవకాశాన్ని అతనికి మనం ఇవ్వగలమేమో చూద్దాం. ఆమె కూడా అంత సమర్థురాలేం కాదు. నిజం చెప్పాలంటే ఆ నల్ల చిరుతపులి ఆమెను రక్షిస్తోంది. కాని మాట్లాడకుండా నిశితంగా వీక్షించే ఈ రకమైన చిరుతపులి నిస్తేజం ఆవహించినవాళ్లలో అంతగా ప్రభావాన్ని చూపదు. తన కళ్ల రహస్యం ఎదుటివాళ్లకు తెలిసిపోతుందేమోననే భయం ఆమెకు కలగడం ప్రారంభించింది. అందుకని ఆమె బాగా వెలుతురున్న ప్రదేశాలకే వెళ్ల సాగింది. ఆమె మెలకువతో వున్నప్పుడు లోపలి చిరుతపులి కళ్లు తెరిచి నిద్రపోతుంది. ఆమె నిద్రిస్తున్నప్పుడు చిరుతపులి బహుశా మేల్కొని వుంటుందేమో. కాని ఈ విషయాన్ని నిర్ధారించడం సాధ్యమయ్యేపని కాదు. చిరుతపులికి ఆహారంగాని, ప్రేమ ప్రదర్శనగాని అవసరం లేవు.

***అసలు మెరిసే ఆ కళ్లను తను నిజంగా చూశాడా లేక అవి కేవలం తను ఊహించుకుంటున్నవా? (దృష్టి భ్రమలాగ, లేక అట్లాంటిదే మరేదో లాగ) అని ఆలోచిస్తుంటాడతడు. తన ఊహాశక్తి అంత గొప్పదనే నమ్మకం లేకపోవడం వల్ల ఆ మెరిసే కళ్లను తాను చూసినట్టు నిర్ధారించుకుంటాడు.***

ఇప్పుడు ఆ చిరుతపులి పేరు పెపిటా మాత్రమే. బాస్ ఆమెను మార్దవంగా చూడటం ప్రారంభించాడు. కాని ఆమె కళ్లల్లోకి చూడ్డం లేదని మనం మరచిపోకూడదు. వాళ్లిద్దరు మిట్టమధ్యాహ్నపు వెల్తురులో ఆఫీసు కార్పెట్ మీద శారీరకంగా సంగమిస్తారు. వాళ్ల మధ్య ఆ సంబంధం కొంత కాలంపాటు సాగుతూనే వుంటుంది.

ఈ కథకు ఈ కిందివాటిలోని ఏ ముగింపైనా ఉండే అవకాశముంది.

* సంవత్సరానికోసారి పెపిటా అసూయతో రగిలిపోతోంది. ఎందుకంటే బాసే మో అతడనుకున్నది చేయగలుగుతున్నాడు. పెపిటా మాత్రం ఒంటికన్నుతో మిగిలిపోతోంది.

* ఆమె కళ్లు ఆమె ఆత్మకు గవాక్షాలని, అదే విధంగా కిటికీ ఆమె ఆత్మ అని అన్నందుకు బాస్‌ను కిటికీలోంచి బయటకు తోసేయడం జరుగుతోంది.

* పెపిటా ఆమె కళ్లనుంచి లివర్‌కు పాకడం వల్ల లివర్ జబ్బు వచ్చింది.

* ఆమె అతన్ని పెళ్లి చేసుకుంది. వాళ్లకి ఒకరినొకరు చీకట్లో చూసుకునే ధైర్యం లేకపోవడం వల్ల కరెంటుబిల్లు నమ్మలేనంత విపరీతంగా పెరిగిపోయింది.

* పెపిటా అతనితో సిల్లీగా, బాధాకరంగా ప్రవర్తిస్తోంది. ఆమె అతన్ని వదిలి అడవి జంతువులను సాకేవాడి దగ్గరకు పోయింది. వాడైతే తనను తిడతాడు కదా!

* ఆమె తన కళ్లకు ఆపరేషను చేస్తానని వాగ్దానం చేసిన కళ్ల డాక్టరు దగ్గరికి వెళ్లిపోయింది.

* ఆమె జంతువుల డాక్టరు దగ్గరికి వెళ్లిపోయింది. ఎందుకంటే పెపిటాకు జబ్బు చేసింది. ఆ చిరుతపులి చచ్చిపోతే తను గుడ్డిదవుతుందని ఆమె భయపడింది.

* – పెపిటా బౌద్ధమతం స్వీకరించి శాకాహారిగా మారటం వల్ల ఆమె రోజూ తన కళ్లను ఐలోషన్‌తో కడుగుతూ సంతోషపడిపోతోంది.

* అమెరికాలో నల్ల చిరుతపులుల సమస్య పరిష్కారం కోసం ఒక కొత్త విధానం కనిపెట్టారని తెలిసి ఉత్సాహంతో ఆమె అక్కడికి వెళ్లింది. కాని తీరా ఆ విధానాన్ని చూసేసరికి అది ఏంటో పూర్తి భిన్నంగా ఉంది.

•

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.
* మీ రచనలు పంపించవలసిన చిరునామా:

ఆదివారం వార్త
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక
లోయర్ ట్యాంక్‌బండ్
హైదరాబాద్ – **500 080**